స్టేట్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఇద్దరు విద్యార్థుల ఎంపికపై అభినందనలు తెలిపిన ఎంఈఓ2 చిట్టిబాబు

కంచిలి, నవంబర్ 16 ప్రభాతవార్త



పదవ తరగతి ఎస్ఏ1 పరీక్షలను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న మిషన్ మార్చ్ 2027 కార్యక్రమంలో భాగంగా కంచిలి మండల ఎంఈఓ2 చిట్టిబాబు ఎంఎస్ పల్లి ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఇటీవల ఇచ్ఛాపురంలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం నాలుగు మండలాల విద్యార్థులకు నిర్వహించిన స్టేట్ లెజిస్లేటివ్ అసెంబ్లీ 2026 పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు పంది పల్లవి, జామి సిరి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎంఈఓ 2 చిట్టిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, పాఠశాల సిబ్బంది ఎంపికైన విద్యార్థినులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఇటువంటి పోటీల్లో ప్రతిభ కనబర చడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి కమిటీ విద్యార్థుల అకడమిక్ ప్రతిభను పరిశీలించి, తుది ఎంపికలో భాగంగా నవంబర్ 26న నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఈ ఇద్దరు విద్యార్థినుల్లో ఒకరిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : శ్రీతేజ్ భరత్

రాజాం, నవంబర్ 16 ప్రభాతవార్త :



రాజాం పురపాలక సంఘంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఎన్నికల నియమావళి పాటించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీతేజ్ భరత్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే ప్రజలు 8019995847 నవంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని శ్రీతేజ్ భరత్ తెలిపారు.

అనుమతులు లేకుండా సంచి డాక్టర్లు వైద్యం చేస్తే చర్యలు

ఐటిడిఏ పిఓ పవర్ స్పష్నిల్ జగన్నాథ్ వెల్లడి



సీతంపేట, నవంబర్ 16 ప్రభాతవార్త :

అనుమతులు లేకుండా సంచి డాక్టర్లు వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పిఓ పవర్ స్పష్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. సోమవారం సీతం పేట మెయిన్ రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న సంచి డాక్టర్‌ను వైద్య తనిఖీల్లో భాగంగా వైద్య బృందం, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. కొత్తూరు మండలానికి చెందిన సంచి డాక్టర్ అనుమతులు లేకుండా వైద్యం చేస్తూ వైద్య బృందం, పోలీసు సిబ్బంది అతడిని విచారించగా, వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అనుమతులు, ఆర్.ఎం.పి. వైద్య అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు లేదా లైసెన్స్ ఏవీ లేనట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతులు, అర్హతలు లేకుండా వైద్య చికిత్సలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇకపై ఎవరూ అనుమతులు లేకుండా వైద్య చికిత్సలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పిఓ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డోనుబాయి పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తనకు న్యాయం చేయాలని మాజీ ఎంపీటీసీ ఆవేదన

ఇచ్ఛాపురం, నవంబరు 16 ప్రభాతవార్త:



తనకు తన భర్త వలన జరిగిన అన్యాయం పట్ల న్యాయం చేయాలని ఈదుపురం మాజీ ఎంపీటీసీ నర్తు శాంతి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అర్ జే ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019లో నర్తు నరేంద్ర యాదవ్ తమ్ముడు నియోజకవర్గ యువజన వైస్సార్సీపీ అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ (బుజ్జి)తో వివాహం జరిగిందని గత కొంతకాలంగా మనస్పర్థలు కారణంగా ఒడిశా జైపూర్‌లో తల్లిదండ్రులు వద్ద ఉంటున్నానని అన్నారు. గతంలో ఎంపీటీసీగా పని చేశానని చెప్పారు. తన స్వగ్రామం కంచిలి మండలం ఎం ఎస్ పల్లి అని చెప్పారు. తన భర్త ప్రేమ్ తన సొంత అన్నయ్య కుమార్తె 19 ఏళ్ల తన మేనకోడలుతో చనువుగా ఉంటున్నారని ఇదే విషయంపై నిలదీయడం జరిగిందని, ఈ లోగా తనకంటే 26 ఏళ్ల వయస్సు చిన్న ఉన్న మేనకోడలును తీసుకుని వెళ్లిపోయారని ఈ విషయంపై జై పూర్ పోలీస్ స్టేషన్‌లో, కంచిలి పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

వీరఘట్టం, నవంబర్ 16 ప్రభాతవార్త :

జిల్లాలోని పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 18వ తేదీన రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసు జారీ చేయడంతో పాటు వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారని, అదే రోజు ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, 22న తిరస్కరణలపై అప్పీళ్లు, 23న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించి 29వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను అదే రోజు వెల్లడించనున్నారు. రెండో విడతలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాల్లో రెండో విడత ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు చక చకా ఏర్పాట్లును పూర్తి చేస్తున్నారు.

పంచాయితీ సమరంలో పోటీపడే అభ్యర్థులు ఎక్కడ నామినేషన్ వేయాలంటే...

వీరఘట్టం, నవంబరు 16, ప్రభాతవార్త

మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు ఈ నెల 29వ తేదీన జరగబోయే ఎన్నికల్లో రెండో విడతలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు సర్పంచులు, వార్డు మెంబర్లు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరగనుంది. అయితే వీరు ఎక్కడెక్కడ నామినేషన్లు వేయాలో అధికారులు ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. వండువ, బిటివాడ ఆడారు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు అభ్యర్థుల నామినేషన్లు వండువ స్వర్ణ గ్రామ కార్యాలయం నందు నామినేషన్‌లను వేయాలన్నారు. అలాగే చలివేంద్రి, దశమంతపురం, సంత నర్సిపురం పంచాయతీలకు చెందినవారు చలివేంద్రి స్వర్ణ గ్రామ కార్యాలయం నందు చిదిమి, యు.వెంకంపేట, పివిఆర్ పురం వారు చిదిమి స్వర్ణ గ్రామ ఆఫీస్ లోను నడిమికెళ్ల, విక్రమపురం, కంబరవలస, కంబరలకు చెందినవారు నడిమికెళ్ల స్వర్ణ గ్రామ కార్యాలయంలో తమ నామినేషన్లను వేయాలన్నారు. అదేవిధంగా తూడి, రేగులపాడు, హుస్సేన్‌పురం, పెదగదబవలస వారు తూడి స్వర్ణ గ్రామ కార్యాలయంలోనూ, కత్తుల కవిటి, ఎం.రాజపురం, కె ఇచ్ఛాపురం వారు కత్తులకవిటి రైతు సేవా కేంద్రం లోను, పనస నందివాడ, తలవరం, మొట్ట వెంకటాపురం వారు పనస నందివాడ స్వర్ణ గ్రామ కార్యాలయం లోను తమ నామినేషన్లు సమర్పించాలన్నారు. నీలానగరం తెట్టంగి, కుమ్మరి గుంట పంచాయతీలకు చెందిన వారు నీలానగరం స్వర్ణ గ్రామ కార్యాలయంలోనూ, కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ, చిట్టిపూడివలస వారు కిమ్మి స్వర్ణ గ్రామ కార్యాలయంలో తమ నామినేషన్లను వేసుకోవచ్చు అన్నారు. అలాగే నడుకూరు మూలలంక, చిన్న గోర కాలనీ వారు నడుకూరు స్వర్ణ గ్రామ కార్యాలయంలోను వీరఘట్టం గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్, వార్డు మెంబర్లు అభ్యర్థులు వీరఘట్టం పంచాయతీ కార్యాలయంలో తమ నామినేషన్లు వేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

రెండో రోజు 44 నామినేషన్లు

ఇచ్ఛాపురం, నవంబర్ 16 ప్రభాతవార్త:



మండలంలో 21 పంచాయతీలలో 6 క్లస్టర్ల పరిధిలో సర్పంచ్ స్థానాలకు రెండో రోజు 44 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వార్డు మెంబర్‌లకు 69 నామినేషన్లు వేశారు. కీర్తిపురం, కేసుపురం, కొఠారిలలో 5 చొప్పున, భిర్లంగి, కొళిగాం, మండపల్లిలో 4 చొప్పున, మశాఖపురంలో 3, బాలకృష్ణాపురం, ఈదుపురం, కేదారిపురం, లొద్దపుట్టి, పాయితారి, తులసిగాంలలో రెండు చొప్పున మిగిలిన పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.

గ్రామాభివృద్ధికి పాటుపడే వారినే సర్పంచ్‌గా ఎన్నుకోండి : మాజీ ఎమ్మెల్యే కలమట

కొత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త :



రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరితో సమన్వయం చేసుకుంటూ, గ్రామాభివృద్ధికి కృషి చేస్తారనే నమ్మకం ఉన్న వ్యక్తులనే సర్పంచ్‌గా ఎన్నుకోవాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి పిలుపునిచ్చారు. కొత్తూరు మండలం మాతల లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలు ఓటు హక్కును ఆలోచించి వినియోగించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి సహకరించే సమర్థులైన అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన ఆకాంక్షించారు.

వీరఘట్టం మండలంలో సర్పంచుల రిజర్వేషన్లు ఇవే..

వీరఘట్టం, నవంబర్ 16 ప్రభాతవార్త :

వీరఘట్టం మండలంలో ఈ నెల 29వ తేదీన 34 పంచాయతీలకు జరుగునున్న ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. ఆడారు, కత్తుల కవిటీ, కుమ్మరి గుంట, యు. వెంకంపేట పంచాయితీలకు బీసీకి కేటాయించారు. అలాగే బిటివాడ, చలివేంద్రి, కంబర, చిదిమి, పనసనందివాడ, తలవరం, వండువ, విక్రమపురం పంచాయతీలకు జనరల్ మహిళకు రిజర్వేషన్‌కు కేటాయించారు. అదేవిధంగా చిట్టపులివలస, దశమంతపురం, హుస్సేనుపురం, కంబరవలస, నడిమికెల్ల, సంత నర్సిపురం, తెట్టింగి పంచాయతీలకు జనరల్‌కు రిజర్వేషన్ కేటాయించారు. అదేవిధంగా గడగమ్మ, నీలానగరం, తూడి పంచాయతీలకు ఎస్సీ మహిళకు రిజర్వేషన్‌ను కేటాయించారు. అలాగే కిమ్మి, కొట్టు గుమ్మడ, మొట్ట వెంకటాపురం, పివిఆర్ పురం పంచాయితీలకు బీసీ మహిళకు రిజర్వేషన్లు కేటాయించారు. అదేవిధంగా ఎం.రాజపురం, మూలలంక పెదగదపవలస పంచాయతీలకు ఎస్టి రిజర్వేషన్‌కు కేటాయించారు. అదేవిధంగా చినగోర కాలనీ, కుంబిడి ఇచ్ఛాపురం పంచాయతీల రిజర్వేషన్లు ఎస్టీ మహిళకు కేటాయించారు. అలాగే నడుకూరు, రేగులపాడు, వీరఘట్టం పంచాయతీలకు ఎస్సీ రిజర్వేషన్లు కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

30వ వార్డు కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అంపోలు సుగుణ

రాజాం, నవంబర్ 16, ప్రభాతవార్త :



రాజాం పురపాలక సంఘంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 30వ వార్డుకు సంబంధించి కౌన్సిలర్‌గా కూటమి అభ్యర్థి అంపోలు. సుగుణ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ వార్డులో ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరుకు సంక్షేమ పథకాలు అందే విధంగా చేస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పించే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. అలాగే మన వార్డును అభివృద్ధి పథంలో ముందుకు నడిపే బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు.

శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్



ప్రభాతవార్త - జలుమూరు

శ్రీముఖలింగేశ్వర స్వామిని దేవాదాయశాఖ కమిషనర్ ఎన్.సుజాత దర్శించుకున్నారు. పురోహితులు ఆమె పేరున గోత్రనామాలు చదివి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో కే.ఏడుకొండలు తెలిపారు. అనంతరం పురోహితులు ఆమెను ఆశీర్వదించి, శ్రీముఖలింగేశ్వర పటంను అందజేశారు.

పవిత్ర పుణ్య దినాల్లో అన్నదానమే పుణ్య దానం

పొందూరు, నవంబర్ 16 ప్రభాతవార్త :



కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన పుణ్య దినాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించి పుణ్య ఫలాన్ని ఇచ్చి అన్నదానం స్వీకరిస్తే మానసిక ప్రశాంతతను ఐశ్వర్యాలను భగవంతుడు ప్రసాదించి అమితమైన ఫలితాలు ఫలిస్తాయని వేద పండితుల ఆదేశాలను తూచా పాటిస్తూ స్థానిక అక్కమాంబ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్న సందర్భంగా పవిత్ర పుణ్య దినమైన కార్తీక మాస మొదటి సోమవారం భారీ ఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించారు. అమ్మ తల్లి ప్రసాదాన్ని స్వీకరించడానికి వేలాది మంది భక్తులు కదలి వచ్చారు. అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావించిన భక్త మహేశ యులం దరికీ భోజన సౌకర్యాలను దగ్గరుండి కల్పించారు.రాష్ట్ర నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్ అనకాపల్లి విజయలక్ష్మి, మాజీ, తాజా ఎంపీటీసీలు అనకాపల్లి వాణి, అనకాపల్లి లోకేష్ (చిన్న),జిల్లా నాగవంశ సంఘ నేతలు లాయర్ రంగారావు, అనకాపల్లి శ్రీనివాసరావు, అప్పల నాయు డులతో పాటు, స్థానిక యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షులు,వ్యాపారవేత్త గుడ్ల చంద్రశేఖర రావు, పైడితల్లి అమ్మవారి ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అనకాపల్లి శివకుమార్, జిల్లా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బెవర అప్పారావు వంటి ఆధ్యాత్మిక ప్రముఖులు, సంఘ సేవకులు, పలు పెద్దలుచే ఆలయ కమిటీ అర్చకుడు అనకాపల్లి చిన్నారావు,వెంకట్రావు, రమణ, రవి కుమార్ అమ్మ తల్లి దర్శనం చేయించిన అనంతరం దగ్గరుండి ప్రజలందరికీ అన్న ప్రసాదం అందించారు.

వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బొడ్డేపల్లి అజంతా కుమారి నామినేషన్

ఆమదాలవలస, నవంబర్ 16 ప్రభాతవార్త :



ఆమదాలవలస మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిగా బొడ్డేపల్లి అజంతకుమారి సోమవారం నామి నేషన్ వేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి చైర్‌పర్సన్‌గా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా అభ్యర్థి అజంత కుమారి ఓటర్లను కోరారు. 28 వార్డుల్లో బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసీపీ హయాంలో పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, మరలా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఒక అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. వైసీపీకి ప్రజాధారణ ఉందని, ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి

జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న



పొందూరు, నవంబర్ 16 ప్రభాతవార్త :

వచ్చే నెల12న స్థానిక న్యాయస్థానంలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన ఎక్కువ కేసులు పరిష్కరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.జ్యోత్స్న న్యాయవాదులను కోరారు. ఈ లోక్ అదాలత్‌కి సంబంధించి సోమవారం కోర్టు పరిధిలోని న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఈ విషయమై న్యాయవాదులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు కె.రమణమూర్తి, కె.అశోక్ కుమార్, వై.వి.బ్రహ్మం, పి.రామ్మోహనరావు, డి. పల్లవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి గ్రీన్ టీం సభ్యులు చేరిక

పార్టీలోకి ఆహ్వానించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్ రావు



ఆమదాలవలస, నవంబర్ 16 ప్రభాతవార్త

ఆమదాలవలస మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలని జనసేన పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పేడాడ రామ్మోహన్‌రావు తెలిపారు. ఆమదాలవలసకు చెందిన గ్రీన్ టీం వ్యవస్థాపక అధ్యక్షులు సాధు రమేష్ తన బృంద సభ్యులతో కలిసి సోమవారం జనసేన పార్టీలో చేరారు. ఆమదాలవలస జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్‌రావు జనసేన పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ టీం వ్యవస్థాపక అధ్యక్షులు సాధు రమేష్‌తో పాటు కింజరాపు గణేష్, సాధు కామరాజు, కింజరాపు బాల కృష్ణ, కింజరాపు లక్ష్మణరావు (మాజీ కౌన్సిలర్), బన్నా బాల భాస్కరరావు, పులగు మహేష్, బాన్న శంకర్, లావేటి పాపారావు, అల్లాడ గడ్డిరాజు, జోగి సూరి తదితరులు జనసేన పార్టీలో చేరారు. అనంతరం పేడాడ రామ్మోహన్ రావు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు.

హరనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

కోటబొమ్మాళి, నవంబరు 16 ప్రభాతవార్త :



కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తులు ఓంకారం, హర నాయస్మరణతో మార్మోగాయి. స్థానిక ఉమావ ల్లేశ్వర రస్వామి ఆలయంలో వేకువజామునుంచి భక్తులు క్యూ కట్టారు. భక్తుల రద్దిని చూసి దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తపేట శివకేశవ పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకులు గౌరిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నిమ్మాడ, జర్జంగి, సుబ్బారావుపేట, హరిశ్చంద్రపురం, యలమంచిలి, లఖండిడ్డి, గంగరాం, కురుడు, దంత తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే వేకువ జామున మహిళలు చెరువుల వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకాకుళం వార్త

కంచిలిలో నామినేషన్ల హోరు

రెండు రోజుల్లో 78 సర్పంచ్, 203 వార్డు సభ్యుల నామినేషన్లు

ప్రభాతవార్త - కంచిలి

కంచిలి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. నామినేషన్ల దాఖలుతో మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. రెండు రోజుల నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు 18 నామినేషన్లు దాఖలు కాగా, రెండో రోజు 60 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మొత్తం సర్పంచ్ స్థానాలకు 78 నామినేషన్లు నమోదయ్యాయి. అదేవిధంగా వార్డు సభ్యుల స్థానాలకు మొదటి రోజు 29 నామినేషన్లు, రెండో రోజు 174 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు మొత్తం 203 వార్డు సభ్యుల నామినేషన్లు నమోదయ్యాయి. ముఖ్యంగా బురగాం గ్రామంలో అత్యధికంగా 27 వార్డు సభ్యుల నామినేషన్లు, ముకరాంపురంలో 19 నామినేషన్లు దాఖలైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతుండగా, అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైసిపి తరపున నామినేషన్ దాఖలు చేసిన పాలవలస పద్మావతి



రాజాం, నవంబర్ 15, ప్రభాతవార్త :

రాజాం పురపాలక సంఘంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పాలవలస పద్మావతి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ రాజాం పురపాలక సంఘం అభివృద్ధి బాటలో ఉండేలా కృషి చేస్తానని తెలిపారు. త్రాగునీరు, డ్రైనేజీ పారిశుద్ధం విషయంలో దృష్టి పెట్టి ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో నీటి సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కావున పట్టణ ప్రజలు ఆలోచించి మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని కోరుచున్నాను. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన. చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్ బాబు, నియోజకవర్గం సమన్వయకర్త తలే. రాజేష్ వైసిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో పోటెత్తిన భక్తులు

హర హర మహాదేవ శంభో శంకర



జలుమూరు, నవంబరు 16 ప్రభాతవార్త :

కార్తీక మొదటి సోమవారం శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుటకు భక్తులు శివనామ స్మరణతో పోటెత్తారు. వేకువజామున వంశధార నది తీరంలో రెండు గంటలకు స్నానములు చేసి దైవ దర్శనం చేసుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఉదయము 10 వరకు అంతంత మాత్రముగా భక్తులు ఉండేవారు. పది 10 గంటల తర్వాత ఒక్కసారి క్యూ లైన్‌లన్నీ నిండిపోయి, రోడ్డుపై కాళింగ వీధి వరకు లైన్‌లో గంటల తరబడి స్వామిని దర్శించుకోవడానికి నిల్చుని అన్నారు. దేవుని ప్రసాదం టిక్కెట్ రుసుం చెల్లించిన వారికి ప్రసాదం ఇచ్చారు. అన్నసంతర్పణ కూడా అంతంత మాత్రమే ఉన్నది. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు విషయంలో నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై బి అశోక్ బాబు, సిబ్బంది నిర్వహించారు.

కవిటి మండలంలో 70 సర్పంచ్ నామినేషన్లు



కవిటి, నవంబర్ 16 ప్రభాతవార్త :

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు సోమవారం కవిటి మండలంలో 23 పంచాయతీలుగాను 70 నామినేషన్లు దాఖలైనట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. బిజీ పుట్టుగ నుండి 4, బల్లిపుట్టుగ నుండి 2, బెజ్జిపుట్టుగ నుండి రెండు బెలగాం నుండి రెండు బైరిపురం నుంచి ఒకటి, డిజి పుట్టుగ నుంచి 4, గొర్లపాడు నుంచి ఒకటి, జగతి నుంచి ఐదు, కపాసుకుద్ది నుంచి ఐదు, కరాపాడు నుంచి 4, కవిటి నుంచి మూడు, కొజ్జారియా 4, కుసుంపురం ఏడు, లండారిపుట్టుగ 1, మాణిక్యపురం రెండు, నెలవంక 3, రాజపురం ఆరు సహలాలపుట్టుగ నాలుగు, సిలగాం ఒకటి, దూగానపుట్టుగ 5, ఇద్దివానిపాలెం 4 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

పట్టణ ప్రగతిలో భాగస్వామ్యంగా నిలవండి : ఎమ్మెల్యే కోండ్రు .. జనసేన చైర్మన్ అభ్యర్థి

**సౌజన్యలతతో పాటు 32 వార్డుల కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి

పిరిడి, గొర్ల సీతారాంపురం సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్



బొబ్బిలి, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలో పిరిడి గ్రామానికి చెందిన జి. శ్రీనివాసరావు సతీమణి గోర్జ సుధారాణి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ స్థానిక హైస్కూల్లో దాఖలు చేశారు. గొర్లి సీతారాంపురం గ్రామంలో ఈశ్వర ప్రసాద్ సతీమణి గొర్ల వసంతకుమారి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గ్రామస్తులు పూర్తిస్థాయి మద్దతుతో నామినేషన్ వేసామని వారు సంతోషం వ్యక్తం చేశారు.

కె.జె. శర్మకు జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారం



విజయనగరం, నవంబర్ 16: ప్రభాతవార్త

'అక్షరకెరటం' తెలుగు దినపత్రిక సంపాదకు డు కె.జె. శర్మకు జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారం–2026 లభించింది. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ సంయుక్తంగా శర్మకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రజాస్వామ్యానికి పత్రికలు పట్టుకొమ్మలని, పాత్రికేయులు విశ్వసనీయతను కాపాడుకోవాలని వక్తలు సూచించారు. పురస్కార గ్రహీత శర్మ మాట్లాడుతూ, 2013లో 'అక్షరకెరటం' ప్రారంభించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని, కథనానికి అధికారుల స్పందనే అసలైన అవార్డు అని అన్నారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. డాక్టర్ స్వప్న హైందవి, బి. లక్ష్మి, ఎం. సుభద్రాదేవి, సీనియర్ పాత్రికేయులు ఎం. విజయభాస్కర్, సముద్రాల నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి, ఐక్యతకు ప్రాధాన్యమిచ్చే అభ్యర్థులను ఎన్నుకోవాలి

పార్వతీపురం, నవంబర్ 16, ప్రభాతవార్త

గత ఐదేళ్లలో అభివృద్ధికి దూరమైన నర్సిపురం గ్రామాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించేందుకు సర్పంచ్ అభ్యర్థి గొట్టాపు వెంకటరమణతో పాటు 14 మంది వార్డు సభ్యులకు మద్దతు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గ్రామస్తులకు పిలుపునిచ్చారు. సోమవారం నర్సిపురం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గొట్టాపు వెంకటరమణ నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఐదేళ్లలో గ్రామం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నర్సిపురం గ్రామం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. సర్పంచ్ అభ్యర్థి గొట్టాపు వెంకటరమణతో పాటు 14 మంది వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కోలాహలంగా సర్పంచ్ నామినేషన్లు..

శృంగవరపుకోట,నవంబర్16, ప్రభాతవార్త



సర్పంచ్‌ల నామినేషన్ల పర్వంలో భాగంగా సోమవారం రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియ కోలా హలంగా జరిగాయి. మండ లంలోని మూల బొడ్డవర పంచాయతీకి సంభందించి కూటమి పార్టీ మద్దతు సర్పంచ్ అభ్యర్థిగా ఇందుకూరి సుమలత సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. బొడ్డవరలోని సచివాల యంలలో ఐదు పంచాయతీలకు సంభందించి ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో సమలత తన నామి నేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారి సాంబశివరావుకు అందజేశారు.రెండు వేల మందితో భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి సుమలత మద్దతుదారులతో చేరుకున్నారు.ఈమె నామినేషన్ తో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.కార్యక్రమంలో గ్రామంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు,అభిమానులు పాల్గొన్నారు.

బొత్స ఆదేశాలు మేరకే ఎంపిపి అభ్యర్థి ఎంపిక

గరివిడి, నవంబర్ 16, ప్రభాత వార్త

శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆదేశాలకి అనుగుణంగా గరివిడి మండల ఎంపిపి ఎన్నిక జరుగుతుందని వైకాపా శ్రేణులు వెల్లడించారు. ఆయన ఎవరిని ప్రతిపాదిస్తే వారికే ప్రాదేశిక సభ్యులు మద్దతుగా నిలిచి ఎంపిపి ఎన్నుకుంటామని వారు స్పష్టంచేశారు. మండలం లో గల ప్రాదేశిక సభ్యులు అందరికీ ఏఒక్కరూ ఆర్థిక చేయూత అందివ్వలేదని, పార్టీ అభిమానం, సత్తిబాబు ఇమేజ్ , అభ్యర్థుల వ్యక్తిగత పలుకుబడి, వారి అందించిన సేవలు తో ప్రాదేశిక సభ్యులుగా ఎన్నికయ్యామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఐదేళ్లు ఒక్కరే ఎంపిపి గా ఉండే ఆలోచనతో సత్తిబాబు ఎవరికి తిలకం దిద్దితే వారే ఎంపిపి అని ఆ పార్టీయులు పేర్కొన్నారు.కాగా సత్తిబాబు ఎవరు పేరుని ప్రతిపాదిస్తారో నని ఉత్కంఠ నెలకొంది.

పోక్స్ చట్టం పై విద్యార్థులకు అవగాహన పరిచిన న్యాయమూర్తి

కురుపాం నవంబర్ 16 ప్రభాతవార్త



పోక్స్ చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సును కురుపాం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె సౌమ్య జోస్పిన్ నిర్వహించారు. సోమవారం కురుపాం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి సౌమ్య జోస్పిన్ మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోక్స్ చట్టము తెలుసుకోవాలని ఆమె అన్నారు. బాలికలకు ఏ విధమైన ఇబ్బందులు జరిగినా వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు న్యాయ స్థానానికి వెంటనే తెలియజేయాలని అప్పుడే ఇటువంటి సంఘటనలు పునరావతము జరగవని ఆమె అన్నారు. అలాగే ఆడపిల్లలకు 18 సంవత్సరాలు లోపే వివాహము జరుగుతుందని అది చట్టరీత్యా నేరమని ఆమెన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అలాగే చిన్నతనంలో పనులు చేయకూడదని ఆమె వివరించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. ముఖ్యంగా పౌష్టికా ఆహారాన్ని పిల్లలకి మూడు పూటలు అందించాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. బాత్రూములను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ కిరణ్ కుమారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గొటారి వెంకట్రావు, పారా లీగల్ వాలంటరీ ఏ కోటేశ్వరరావు లోక్ అదాలత్ ఉద్యోగి పాలకొల్లు శ్రీనివాసరావు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీని ముట్టడిద్దామని సిఐటియు పిలుపు : వర్కర్స్

సాలూరు నవంబర్ 16 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ వెంటనే రద్దు చేయాలని ఇంకా కనీస వేతనాలు చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1న జరిగే చలో ఢిల్లీలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. సోమవారం ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు ఆధ్వర్యంలో కార్మికులు గోడపోస్టర్ విడుదల చేసారు. అనంతరం మాట్లాడుతు దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాశి, కార్పొరేట్లకు సేవ చేసేందుకు ఉన్నచట్టాలు కూడా నాశనం చేస్తుందని విమర్శిం చారు. అలాగే ఎన్డీఏ ప్రభుత్వ విధానాలపై పెద్ద ఎత్తున విద్యార్థిలోకం, కర్షకులు పోరాడుతున్నారని, ఇప్పుడు కార్మిక వర్గం కూడా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని స్పష్టం చేసారు. అంతేకాకుండా జిల్లాలో అన్ని కార్మిక వర్గాలు చలో ఢిల్లీలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. టి.వెంకట్రావు,శంకర్, రవి,రాముడు,శ్రీనివాసరావు, సత్యం,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా నామినేషన్ వేసిన చింతల వసుంధర



రామభద్రపురం, నవంబర్ 16,ప్రభాతవార్త

చింతల రామకృష్ణ మాట్లాడుతూ రామభద్రపురం మండలంలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. సర్పంచ్ ఎన్నికల నగారా మోగడంతో మండలంలోని గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖాలు చేస్తున్నారు రామభద్రపురం మండల పరిధిలో మొత్తం 22 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ ఎన్నికలు 26న నిర్వహించ నున్నారు. అదేవిధంగా 212 వార్డు సభ్యుల స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. మండలవ్యాప్తంగా మొత్తం 38 వేల 820 మంది ఓటర్లు తమ ఓటు హక్కును 26న వినియోగించుకోనున్నారు. నిన్నటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 18వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనుండగా, ఈ నెల 26వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా రామభద్ర పురం మండలంలో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది.

జాగ్రత్తలతో చక్కెర వ్యాధి నివారణ



గరివిడి, నవంబర్ 16, ప్రభాతవార్త

ఆహార నియమాలు, వ్యాయామం ఇతర జాగ్రత్తలతో చక్కెర వ్యాధి నివారణ సాధ్యమవు తుందని పొందూరుకి చెందిన ప్రముఖ చక్కెర వ్యాధి నిపుణులు, లయన్స్ ప్రతినిధి డాక్టర్ వై.మల్లిబాబు అన్నారు. డయాబైటిస్ దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌జిఎస్ సీనియర్ సెకండరీ పాఠశాలలో శ్రీరాం నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయాబైటిస్ అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ డయాబైటిస్ పట్ల అవగహన పెంపొందించుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకొని, వ్యాయామం చేయాలని, వత్తిళ్ళుకి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతీ ఇంటిలో బి.పి, షుగర్ వ్యాధి గ్రస్థులు ఉన్నారన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో తగు జాగ్రత్తలు పాటించి చక్కెర వ్యాధి ప్రబల కుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తొలుత పాఠశాల ప్రిన్సిపాల్, శ్రీరాం విద్యాపీఠ్ కార్యదర్శి బలిజేపల్లి రవి స్వాగతోపన్యాసం గావిస్తూ.. డయాబైటిస్ పై పలు సూచనలు చేశారు.ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ ఆహార నియమాలు పాటించాల న్నారు. పాఠశాల డీన్ పి.సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి



కొమరాడ, నవంబర్ 16, ప్రభాతవార్త

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ విషయంలో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారిం చాలని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) అధికారి డాక్టర్ టి.జగన్ మోహన రావు సూచించారు. సోమవారం కొమరాడలో ట్రైబల్ వెల్ఫేర్, డా. బి ఆర్. అంబేద్కర్ గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, ఇతర మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. త్రాగునీటి పరీక్షలు,నివేదికల రికార్డు, సిక్ రికార్డులు, సిక్ రూమ్ నిర్వహణ తనిఖీ చేశారు. ఆరోగ్య సమాచార వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. డార్మేటరీ, టాయిలెట్ల పరిశు భ్రతపై సూచనలు చేశారు. విద్యార్థుల ఆర్.బి.ఎస్.కె స్క్రీనింగ్ త్వరగా పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి విద్యార్థి వద్ద తాగునీటి బాటిల్ ఉండేలా చూడాలని, హాస్టల్ ప్రాంగణంలో ప్రతీ వారం డ్రైడే నిర్వహించాలని తెలిపారు. వ్యాధులు, మూల కారణాలు, నియంత్రణ మార్గాలపై ప్రతీ ఒక్కరు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. మన్యం వీడియో డాక్టర్ ద్వారా స్పెషలిస్ట్ వైద్య సేవలు పొందాలన్నారు. విద్యార్థుల్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య, వసతిగృహ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

సేవ్ ది గర్ల్ చైల్డ్..

ఆడ పిల్లలను రక్షిద్దాం అనే అంశంపై అవగాహన కల్పిస్తూ బాలికల ఆరోగ్యం, లింగ వివక్షత, పిసిపిఎన్డిటి యాక్ట్, టీనేజ్ వివాహాలు ఆరోగ్యంపై ప్రభావం, రక్త హీనత, మెనుస్ట్రవల్ హైజీన్ పై వివరించారు. ఆర్.కె. ఎస్.కెలో బాగంగా వీటిపై బాలికలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కొమరాడ పిహెచ్సీ సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.జి.దేవేంద్ర, డిప్యూటీ డెమో డి.వి గిరిబాబు, ప్రిన్సిపాల్స్ లక్ష్మణరావు, పద్మావతి, ఈఓ నరసింగరావు, వార్డెన్లు, వైద్య, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన



నెల్లిమర్ల, నవంబర్ 16, ప్రభాతవార్త

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో సాధన యువజన సంఘం, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్, ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ శిబిరానికి 82 మంది రోగులు హాజరయ్యారు. వీరిని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆనంద్ రావు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం బ్రాంచ్ చైర్మన్ కంది వెంకటరమణ, కార్యదర్శి సత్యం, కమిటీ సభ్యులు ఎం. తిరుపతిరావు , సాధన యువజన సంఘం అధ్యక్షుడు, ఇండియన్ రెడ్ క్రాస్ విజయనగరం బ్రాంచ్ పిఆర్ఓ పోల్నీతి దుర్గాప్రసాద్, డీఎఫ్ఓ షేక్ సమీ, ఏఎంసి డైరెక్టర్ ఎం. ఎం. నాయుడు, మద్దిల సూరిబాబు, ఉపాధ్యాయులు ఉండ్రు శ్రీనివాసరావు, సభ్యులు నామాల శ్రీను, కనకల సురేంద్ర , తలాడ శంకర్, పసుమర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం 25
పార్వతీపురం మన్యం
వార్త

నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులకు బేబీ నాయన మద్దతు



బొబ్బిలి, నవంబర్ 16 ప్రభాతవార్త

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసిన కూటమి మద్దతుదారులు, పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 2026 మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో అధికార కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) మద్దతుదారులు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో పలు పంచాయితీల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) పాల్గొన్నారు. మెట్టవలస, పారాది, దిబ్బగుడివలస, సీతయ్యపేట, కింతలవానిపేట, కోమటిపల్లి, ఎమ్.బూర్జవలస, నారాయణప్పవలసలి పంచాయితీలకు ఈరోజు నామినేషన్లు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాలలో అల్లరి చేయకండి మాలాటీలకు పని కల్పించకండి : సీఐ



బొబ్బిలి, నవంబరు 16 ప్రభాతవార్త:

ప్రతి గ్రామములో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా బొబ్బిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె నారాయణ రావు తన సిబ్బంది గ్రామాలకు వెళ్లి గ్రామ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు చేయవద్దని కుల కలహాలు మత కలహాలు చేస్తే మాలాటి పని ఏంటో మేము గుర్తు చేసుకోవాల్సి వస్తుందని సున్నితంగా మండల ఇస్తున్నారు. ప్రతి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు ఆపి తనిఖీలు విస్తృతంగా చేస్తున్నారు. ముందు మద్యం ఎక్కడ రవాణా జరుగుతుందని ముందుగానే తమ సిబ్బంది పరిశీలన చేస్తున్నారు. పట్టణ పరిసరాల్లో ప్రతి లాడ్జి బస్టాండు రైల్వే స్టేషన్ తదితర ప్రదేశాల్లో తనదైన శైలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తక్షణమే సమాచారం అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు మీరంతా సహకరించి అల్లరులు లేని గ్రామాలుగా మన బొబ్బిలి మండలం ఉండాలనే కోరుకుంటున్నారు

ఎల్.కోటలో జోరుగా నామినేషన్లు..

మేజర్ పంచాయతీలో నువ్వా నేనా!



లక్కవరపుకోట, నవంబర్ 16, ప్రభాతవార్త

లక్కవరపుకోట మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది రెండవ రోజు సర్పంచ్‌కి 106 వార్డ్ మెంబెర్స్‌కి 442 నామినేషన్‌లు వచ్చాయి అని ఎంపీడీఓ అల్లు భాస్కర్‌రావు తెలిపారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీలో సర్పంచ్ పదవి కోసం అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. రెండు రోజుల పాటు కలిపి మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో 125 సర్పంచ్ అభ్యర్థులు, 502 వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుందని ఆయన వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మండలంలోని అధిక శాతం పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రధాన పార్టీల నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలకు పదును పెడుతున్నారు.

రెండు రోజుల్లో 341 నామినేషన్లు స్వీకరణ

ప్రభాతవార్త (బాడంగి)

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు విశేష స్పందన లభిస్తోంది. రెండు రోజుల వ్యవధిలో మండలంలో సర్పంచ్ పదవులకు 75, వార్డు సభ్యుల స్థానాలకు 266 నామినేషన్లు కలిపి మొత్తం 341 నామినేషన్లు స్వీకరించినట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో డి.వి. శ్రీలత వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, నిబంధనల మేరకు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పినపెంకి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆమె స్వయంగా సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

